ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్స్ చేస్తే చర్యలు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4: జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్స్ చేయడానికి ఇంటర్ బోర్డు షెడ్యూల్ విడుదల చేయలేదని, నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్స్ చేస్తే చర్యలు తీసుకుంటామని డీఐఈవో రవిబాబు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొన్ని కళాశాలలు అడ్మిషన్స్ తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వచ్చే విద్యాసంవత్సరానికి కళాశాలల గుర్తింపు ప్రకటించలేదని, గుర్తింపు ఉన్న కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. వేసవి సెలవుల్లో టెన్త్ పూర్తయిన విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సు పేరుతో ఇంటర్ తరగతులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలుంటాయని, ఉన్నాతాధికారులకు రిపోర్ట్ చేస్తామని పేర్కొన్నారు.

పూర్తిగా హాజరుకాని స్పెషల్ అసిస్టెంట్లు

- డైట్ నుంచి విద్యార్థులు హాజరు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4: పదో తరగతి స్పాట్‌కు హాజరుకాని స్పెషల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ కొందరు వాటిని ఖాతరు చేయలేదు. 162మందికి విద్యాశాఖాధికారి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేయగా గురువారం 110 మంది స్పాట్‌కు హాజరు కాగా వారిలో 70మంది షోకాజ్‌కు సమాధానం ఇచ్చి విధుల్లో చేరారు. మరో 40మంది అనారోగ్య కారణాల సమస్యలన్నాయని అనుమతి తీసుకున్నారు. మరో 50మంది ఉపాధ్యాయులు షోకాజ్‌లకు ఎలాంటి వివరణలు ఇవ్వకపోవడంతో మరోకసారి షోకాజ్‌లు ఇచ్చి ఛార్జెస్ ఫ్రేమ్ చేసేందుకు విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్పెషల్ అసిస్టెంట్స్‌గా డైట్ కళాశాలలో డీఈడీ చదువుతున్న 21మంది విద్యార్థులను వినియోగిస్తున్నారు. విద్యాశాఖ జేడీ సర్వీసెస్ పీ మదన్‌మోహన్ శుక్రవారం మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించనున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు.

డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా డీఈవోకు అదనపు బాధ్యతలు

డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ రెండు నెలల పాటు సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ముగిసిన ఇంటర్ స్పాట్..

నగరంలోని నయాబజార్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ మూల్యాంకనం గురువారంతో ముగిసింది. ఫిజిక్స్, కెమిస్ట్రి, ఇంగ్లిష్ సబ్జెక్టులలో స్క్రూట్నీ, వెరిఫికేషన్ ప్రక్రియ మాత్రం చేయాల్సి ఉంది. దీని కోసం 150మంది సిబ్బందిని నియమించినట్లు క్యాంప్ ఆఫీసర్ రవిబాబు తెలిపారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్ష

విద్యార్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తున్న సిబ్బంది

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4: జాతీయ స్థాయి ఇంజినీరింగ్ ఎంట్రన్స్ (జేఈఈ) మెయిన్స్ రెండో విడత పరీక్ష గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 537మంది విద్యార్థులకు 501మంది విద్యార్థులు హాజరై 36 మంది గైర్హజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 535మంది విద్యార్థులకు 499మంది విద్యార్థులు హాజరై 36మంది గైర్హజరయ్యారని కోఆర్డినేటర్ పార్వతిరెడ్డి తెలిపారు. జిల్లాలో 6 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను తనిఖీ చేసి బయోమెట్రిక్ ద్వారా హాజరును నమోదు చేశారు.

పట్టభద్రుల ఓటర్లు 4.61 లక్షలు

ఎమ్మెల్సీ తుది ఓటరు జాబితా విడుదల

నల్లగొండ, ఏప్రిల్ 4: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను నల్లగొండ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన గురువారం విడుదల చేశారు. ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 4,61,806 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నట్లు లెక్క తేలింది. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 83,606 మంది, అత్యల్పంగా సిద్దిపేటలో 4,671 మంది ఓటర్లు ఉన్నారు. నవంబర్1, 2023 అర్హత తేదీ ఆధారంగా రూపొందించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం తుది ఓటరు జాబితాను ప్రకటించారు. నియోజకవర్గంలో 12 జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాలతోపాటు, సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో సైతం ఈ జాబితాను ప్రచురించినట్లు కలెక్టర్ తెలిపారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలి

పెనుబల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 4: యాసంగి వరి ధాన్యాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, మద్దతు ధర అందుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నాగేశ్వరరావు కోరారు. మండలంలోని గుదిమళ్ల, గోళ్లపాడు, కస్నాతండ, తీర్థాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైనట్లు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల్లో యాసంగి వరి పంటలను ఆయన గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ.. క్వింటాల్ ధాన్యం గ్రేడ్-ఏ రకానికి రూ.2,203; సాధారణ రకానికి రూ.2,183 ధర ఉందని చెప్పారు. తేమ శాతం 17 ఉండాలన్నారు. ఏఈవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెనుబల్లి, ఏప్రిల్ 4: మండలంలోని ముత్తగూడెం గ్రామంలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు గురువారం ప్రారంభించారు. దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★Wanted Agents, Associates
Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాగునీటి ఎద్దడిని నివారించండి

వేంసూరు, ఏప్రిల్ 4: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మండలంలోని లింగగూడెం, వేంసూరు, మర్లపాడు, అమ్మపాలెం గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. వేంసూరు కేసీఆర్ కాలనీ తాగునీటి పరిస్థితిని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ జయలక్షిత్మ నుంచి తెలుసుకున్నారు. తమకు మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదని అమ్మపాలెం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎంపీడీవో రమేష్, ఎంపీవో రంజిత్‌కుమార్, ఆర్‌అండ్‌బీ జేఈ ప్రకాశ్, పీఆర్ జేఈ సాయికృష్ణ, ఎంఈవో చలంచర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి

జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 4: ప్రశాంత వాతావరణంలో ప్రలోభాలకు తావులేని ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, రాజుపేట శ్రీరస్తు కన్వెన్షన్ సెంటర్‌లో ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల అంతరాష్ట్ర సరిహద్దుల సమన్వయ సమావేశం జరిగింది. రెండు జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ఎస్ డిల్లీరావు, ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల సీపీలు కాంతిరాణా టాటా, సునీల్‌దత్‌తో పాటు సరిహద్దు నియోజక వర్గాల రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, రవాణా, ఐటీ, కమర్షియల్ ట్యాక్స్, జీఎస్‌టీ, అటవీ, బ్యాంకింగ్ తదితర శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. అంతర్రాష్ట్ర సరిహద్దు వెంబడి ప్రత్యేక చెక్ పోస్టులతో నిఘా పటిష్టం చేశామన్నారు. రెండు జిల్లాల డీఈవో, సీపీలతో పాటు వివిధ విభాగాల నోడల్ అధికారులు సమన్వయంతో పని చేస్తున్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల్లో ఓటుహక్కు కలిగిన వారు ఉన్నట్లు సమాచారం ఉందని, పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని, సరిహద్దు వెంబడి నిఘా విషయంలో రెండు జిల్లాల మధ్య పటిష్ట సమన్వయం ఉన్నట్లు తెలిపారు. డబ్బు, మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణాను నిలువరించేందుకు ప్రధాన రహదారులతో పాటు డొంక రూట్ల పైనా దృష్టి సారిస్తున్నట్లు సీపీ అన్నారు. సమావేశంలో ఖమ్మం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రావద్దు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 4: జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు రోజువారీ గ్రామాల సందర్శించాలన్నారు. తాగునీటి సరఫరాలో లీకేజీలు గుర్తిస్తే, సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి, వెంటనే నియంత్రించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మండల స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, జడ్పీ సీఈవో వినోద్, డీపీవో హరికిషన్, ఆర్డీవో జీ గణేశ్, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 4: ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలను వారు పరిశీలించారు. సీ విజిల్ యాప్, 1950 టోల్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, పరిష్కార వివరాలు తెలుసుకున్నారు. ఎపిక్ కార్డులకు సం బంధించి 12, ఫారం-6కు సంబంధించి 10, ఫారం-8కు సంబంధించి 15, ఫారం-18కు సంబంధించి 2, ఇతరాలు 1 ఉన్నట్లు వారు తెలిపారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి ద్వారా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, సీపీవో ఏ శ్రీనివాస్, అధికారులు తదితరులు ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన ఏసీటీవో

కల్లూరు ఏసీటీవోను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

సత్తుపల్లి, ఏప్రిల్ 4: కల్లూరు పట్టణంలోని తిరువూరు క్రాస్ రోడ్‌లో గురువారం తెల్లవారుజామున వాణిజ్య పన్నుల శాఖ అధికారి(ఏసీటీవో) శ్రీరామ్, ఆయన సిబ్బందిపై ఏసీబీ అధికారులు దాడి చేశారు. రహదారిపై వాహనాలను అనధికారికంగా నిలిపి, తనిఖీల పేరుతో డబ్బు వసూలు చేస్తుండగా పట్టుకున్నారు. ఏసీటీవో వద్ద ఆధారాలు లేని, అనధికారికంగా ఉన్న సుమారు రూ.10వేల నగదును స్వాధీనపర్చుకుని సీజ్ చేశారు. శ్రీరామ్‌ను, సిబ్బందిని ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ అదుపులోకి తీసుకున్నారు.

నేడు పీర్ గైబ్ షా వలి ఉర్సు మహోత్సవం

ఖమ్మం, ఏప్రిల్ 4: ఖమ్మం నగరం శుక్రవారపేటలోని అతి పురాతన హజరత్ సయ్యద్ పీర్ గైబ్ షా వలి దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా రంజాన్ మాసం 25వ రోజున ఈ వేడుక నిర్వహిస్తారు. ఇస్లాం సంప్రదాయ పద్ధతిలో తరవీహ్ నమాజ్ అనంతరం తుమ్మలగడ్డలోని దర్గా సేవకుడు తాజ్ బాబా ఇంటి వద్ద నుంచి ప్రత్యేక నమాజులతో ఉర్సు ఉత్సవాలు మొదలవుతాయి. ఈ ఊరేగింపు తుమ్మలగడ్డ మస్జీద్, మోమినాన్ స్కూల్, శుక్రవారపేట సెంటర్, రిక్కాబజార్ సెంటర్, శివాలయం మీదుగా హజరత్ సయ్యద్ పీర్ గైబ్ షా వలి దర్గాకు తెల్లవారుజామున చేరుకుంటుంది.

త్రివేణిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4: నగరంలోని త్రివేణి పాఠశాలలో గురువారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు స్నాతకోత్సవ గౌన్ వేసుకోని పట్టాలు అందుకున్నారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరులో రేపు 'రైతు దీక్ష': సండ్ర

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, ఏప్రిల్ 4: రైతులపట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా, రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్న డిమాండుతో ఈ నెల 6న కల్లూరులో నియోజకవర్గ స్థాయి 'రైతు దీక్ష' నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రకటించారు. దీనిని పార్టీ శ్రేణులు, రైతులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన గురువారం రాత్రి కల్లూరులోని బొప్పన రామారావు నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వం 15 రోజుల్లో రైతుబంధును అన్ని స్థాయిల్లో రైతులకు పూర్తిగా పంపిణీ చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ ఐదు కరాలలోపు రైతులకు రైతుబంధును పూర్తిగా ఇవ్వలేదని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లను పూర్తి స్థాయిలో ప్రారంభించలేదన్నారు. ఫలితంగా, రైతులు తమ కష్టార్జితమైన పంటను వ్యాపారులకు విక్రయిస్తున్నారని, వారికి గిట్టుబాటు ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి పథకానికి తోడు తులం బంగారం ఇస్తామన్న ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు పాలెపు రామారావు, కట్టా అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడిఫైడ్ సైలెన్సర్లపై ప్రత్యేక డ్రైవ్

ద్విచక్రవాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏసీపీ శ్రీనివాసులు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 4: ద్విచక్ర వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు గురువారం తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో ఇటీవల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మోడిఫైడ్ సైలెన్సర్లతో నడిపే వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ప్రజలు భయభ్రంతులు కలిగేలా రోడ్లపై అకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారి బైక్‌లకు మోడిఫైడ్ సైలెన్సర్ల వరకూ తొలగించి ఒక్కో వాహనదారుడికి రూ.1000 జరిమానా విధిస్తున్నామని, ఇకపై ధ్వని కాలుష్యాన్ని కల్గించే వాహనాన్ని సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగా సంబంధిత వాహనానికి ఉన్న మోడిఫైడ్ సైలన్సర్‌ను తొలగించి, జరిమానా వేసి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి తరచూ ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్సు, నంబర్ ప్లేట్, నంబర్ సక్రమంగా లేని, నంబర్ ట్యాంపరింగ్ కలిగిన, నంబర్ తుడిపి వేసిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామని, పట్టుబడిన వాహనాలపై అయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ మోహన్ బాబు, ఎస్సై రవి, సాగర్ పాల్గొన్నారు.

నా ఓటు.. నా బాధ్యత

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 4: 'నా ఓటు.. నా బాధ్యత' పేరుతో మండలవ్యాప్తంగా అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఓటు వేస్తామంటూ యువతీ యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పించారు. తహసీల్దార్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

బోనకల్లు, ఏప్రిల్ 4: స్థానిక కొత్త మసీదు ప్రాంగణంలో 300 మంది పేద ముస్లింలకు బుధవారం రంజాన్ తోఫాను ముస్లిం ఐక్య సంఘం పంపిణీ చేసింది. బాధ్యులు షేక్ ముజాహిద్, షేక్ మహబూబ్‌పాషా, గౌసుద్దీన్, జానిమియా, గాలిబ్, ఖాదర్, చాంద్‌పాషా, దస్తగిరి, షాజహాన్, రఫీ, మౌళాలి, బాబు, మదార్‌సాహేబ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నగరంలో ఎంపీ నామా పర్యటన

ఖమ్మం, ఏప్రిల్ 4: ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు గురువారం ఖమ్మం నగరంలో పర్యటించారు. పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి- సతీశ్ దంపతులు కవిరాజ్‌నగర్‌లో నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఎంపీ నామా హాజరయ్యారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం అల్లీపురంలో 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ - సైదుబాబు దంపతులు నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ కార్యక్రమానికి కూడా ఎంపీ నామా హాజరయ్యారు. నాయకులు కిలారి రాంబాబు, బిక్కసాని జశ్వంత్, నాగేశ్వరరావు, సరిపూడి గోపి, చీకటి రాంబాబు, తాళ్లూరి హరీశ్, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడకు లక్షలాదిగా తరలిరావాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్ 4: తుక్కుగూడలో శనివారం జరిగే కాంగ్రెస్ సభకు ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోనియాగాంధీ ఇచ్చిన 6 గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని అన్నారు. అన్ని చోట్ల పంటలు కోతకు వచ్చాయని, ఖమ్మం జిల్లాలో నీరులేక పంటలు ఎక్కడా ఎండిపోలేని అన్నారు. భూగర్భజలాలపైనే రైతులు ఆధారపడుతున్నారని, ఒక్క సెకన్ కూడా కరెంటు పోకుండా సరఫరా చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ నాయకలు పాల్గొన్నారు.

ఏజెంట్ల వ్యవస్థను నిర్మూలిస్తాం

- జిల్లా రవాణా శాఖాధికారి ఆఫ్రిక్ సిద్ధిఖి

మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి ఆఫ్రిక్ సిద్ధిఖి

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 4: రవాణా శాఖ కార్యాలయాల వద్ద ఏజెంట్ల (దళారీల) వ్యవస్థను సమూలంగా నిర్మూలించనున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి అఫ్రిక్ సిద్ధిఖి తెలిపారు. సత్తుపల్లి ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం పరిశీలించారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో రవాణాశాఖ కార్యాలయం వద్ద దళారీ వ్యవస్థ పేరుకుపోయిందని అన్నారు. ఈ వ్యవస్థను సమూలంగా నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయాల వద్ద సెక్యూరిటీని ఏర్పాటు చేసి, దరఖాస్తుదారుల పక్కన సంబంధిత కుటుంబ సభ్యులు మినహా మిగతా ఎవరినీ లోనికి అనుమతించే ప్రసక్తి లేదని చెప్పారు. ఈ విధానాన్ని జిల్లాలోని అన్ని ప్రాంతీయ రవాణా శాఖ అధికారులు విధిగా పాటించాలని ఆదేశించినట్లు చెప్పారు. సత్తుపల్లిలో ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని సత్తుపల్లి ప్రాంతీయ రవాణాశాఖ అధికారికి సూచించినట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. సత్తుపల్లి ప్రాంతీయ రవాణాశాఖాధికారి యోగేశ్వర్‌సింగ్ పాల్గొన్నారు.

గౌడసంఘం ఆధ్వర్యంలో నేరెళ్లకు సన్మానం

మాట్లాడుతున్న గోపా జిల్లా అధ్యక్షుడు గుడిద శ్రీనివాస్

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 4: ఇటీవల ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఘనవిజయం సాధించిన నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్‌కు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. గురువారం సాయంత్రం నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో జరిగిన సన్మాన కార్యక్రమానికి గౌడ అఫీసియల్స్, ప్రొఫెషనల్ అసోసియోషన్ (గోపా), గౌడ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు నేరెళ్లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూగౌడ్, వడ్డెబోయిన నర్సింహరావు, బోడపట్ల వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యుడు బొల్లికొండ శ్రీనివాస్‌రావు, తొడేటి దుర్గాప్రసాద్, మరికంటి వెంకటేశ్వర్లు, వడ్లకొండ శ్రీనివాస్, వైద్యులు పాల్గొన్నారు.

'విజయ' కళాశాల వార్షికోత్సవం

కొణిజర్ల, ఏప్రిల్ 4: మండలంలోని తనికెళ్లలోగల విజయ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం గురువారం జరిగింది. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ గంటా రమేష్, కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి కలిసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జి.జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, డీన్ (అకడమిక్స్) డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు వరుస సెలవులు

ఖమ్మ